మంచి రోజులు మళ్లొస్తయి

- అన్నదాతలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ముంచే రోజులు పోయి మళ్లీ మంచి రోజులు వస్తాయని, అన్నదాతలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఒకే రోజు ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకోవడానికి రేవంత్ సర్కారే కారణమని ఆరోపించారు. పొలం ఉన్న రైతులనూ పొట్టనబెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కౌలు తీసుకున్న కర్షకుల నూ కబళిస్తున్నారని ఎక్స్‌వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. సాగునీటి సంక్షోభం, రుణమాఫీ ద్రోహం, రైతుభరోసా మోసం, కౌలు రైతుకు అందని సాయం.. రైతుకు రక్షణ వలయంగా ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా ఎగ్గొట్టడంతోనే వ్యవసాయం విషవలయంలో చిక్కుకున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో వందలాదిమంది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా చలనం లేదని, ముఖ్యమంత్రికి సోయిలేదని, ప్రభుత్వానికి బాధ్యత లేదని దుయ్యబట్టారు. దసరా పండుగ వేళ వ్యవసాయాన్ని దండుగలా మార్చిన సీఎం రేవంత్‌కు రైతన్నల చేతిలో దండన తప్పదని హెచ్చరించారు.

నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుప్రతిని చూపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేటీఆర్‌పై ట్రోల్స్‌ను సహించేది లేదు

- కాంగ్రెస్ పార్టీ నాయకులకు బీఆర్ఎస్ హెచ్చరిక
- రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు చేస్తున్న కాంగ్రెస్‌పై గులాబీ శ్రేణులు మండిపడ్డాయి. అసహ్యకర, అడ్డగోలు, ఫేక్ పోస్టులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదులు చేశారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, సిరిసిల్ల సహా పలు జిల్లాల్లో ఫిర్యాదు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు కేటీఆర్‌పై దుష్ప్రచారాన్ని ఆపకపోతే దీటుగా సమాధానం చెప్తామని హెచ్చరించారు.

మాంగళ్య దసరా కానుక

ప్రతి వినియోగదారుడికి పక్కాగా స్పాట్ గిఫ్ట్స్

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): దసరా, బతుకమ్మ పండుగ షాపింగ్ చేస్తున్నారా? మీ షాపింగ్ పూర్తయిన వెంటనే అద్భుతమైన కానుకలు అందించేందుకు మాంగళ్య షాపింగ్ మాల్ మీకు సాదర స్వాగతం పలుకుతున్నది. వస్త్ర ప్రపంచంలో సంచలనం సృష్టిస్తూ.. తనదైన ముద్ర వేసిన మాంగళ్యలో చిన్న, పెద్ద తేడాలేకుండా అన్ని వయసుల వారికి అన్ని రకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. చిన్నారులకు వెరైటీ కలెక్షన్స్‌తో పాటు పురుషులు, మహిళలకు ఆకట్టుకునే సంప్రదాయ దుస్తులు అందుబాటు ధరలో ఉన్నాయి. ప్రత్యేకంగా శారీస్, చుడీదార్స్, లెహంగాస్, లెగ్గింగ్స్, పట్టు, ఫ్యాన్సీ, కంచి, ధర్మవరం.. ఒకటేమిటి లేటెస్ట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా అద్భుతమైన కలెక్షన్స్ తెచ్చిపెట్టింది. ఫ్యాషన్ వస్త్రాలతోపాటు సంప్రదాయ దుస్తులను అందుబాటులో ఉంచింది. 1 నుంచి 11వరకు రాష్ట్రంలోని అన్ని మాంగళ్య షాపింగ్ మాల్‌లో వినియోగదారులందరికీ స్పాట్ గిఫ్ట్‌లను అందించి సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తనున్నది.

రుణమాఫీ సగమే!

- స్పష్టం చేసిన ఎస్‌బీఐ గణాంకాలు
- ఆర్టీఐ కింద సమాచారం కోరిన మాజీ మంత్రి హరీశ్‌రావు
- ఎస్‌బీఐ లిఖితపూర్వక జవాబు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ఎప్పుడో గత డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తామని బీరాలు పలికి.. ఆ తర్వాత కనిపించిన దేవుళ్లందరి మీదా ఒట్టేసి ఆగస్టు 15 నాటికి రుణమాఫీ చేస్తామని పదేపదే ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటల్లోని డొల్లతనాన్ని స్వయంగా భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) బయటపెట్టింది. రుణమాఫీ పూర్తయిందని రేవంత్ పదేపదే చెప్తూ వచ్చారు. తాము ఒకే విడతలో రుణమాఫీ పూర్తిచేసినట్టు ప్రకటించుకున్నారు. ఎంతమందికి.. ఎన్ని కోట్లు మాఫీ చేశామని మాత్రం వెల్లడించలేదు. రుణమాఫీ కాక మనోవేదనతో కొందరు రైతులు గుండె ఆగి మరణిస్తే, మరికొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రభుత్వం చెప్తున్న నిబంధనల ప్రకారం తాము అర్హులమే అయినా రుణమాఫీ కాలేదంటూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు రోడ్లెక్కి నిరసనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు ఎంతమంది రైతులకు ఎంత మేర రుణమాఫీ అయిందో చెప్పాలంటూ మాజీమంత్రి హరీశ్‌రావు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ఎస్‌బీఐని సమాచారం కోరారు. దీనికి ఎస్‌బీఐ సమగ్ర సమాధానాలు ఇచ్చింది. ఇప్పటివరకు సగంమందికే రుణమాఫీ అయినట్టు పేర్కొంటూ హరీశ్‌రావుకు పూర్తి వివరాలతో సమాధానం ఇచ్చింది.

హరీశ్‌రావు ఏం కోరారు?

లక్ష కంటే తక్కువ రుణాలు పొందిన రైతులు.. లక్ష, లక్షన్నర మధ్య, లక్షన్నర నుంచి 2 లక్షల మధ్య, 2 లక్షలు, అంతకంటే ఎక్కువ మొత్తంలో రుణాలు పొందిన రైతుల సంఖ్య ఎంత? వారికి అయిన రుణమాఫీ ఎంత? ప్రభుత్వం నిధులు ఎన్ని కేటాయించింది? ఇంకా ఎన్ని నిధులు అవసరం అవుతాయి? వంటి ప్రశ్నలతో దరఖాస్తు చేసుకున్నారు.

హరీశ్‌రావు ప్రశ్న

2024 జూన్ 1 వరకు బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి వ్యవసాయ రుణాలు పొందిన రైతుల మొత్తం సంఖ్యను అందించండి.

ఎ- లక్ష కంటే తక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య

బి- రూ.1 లక్ష, రూ.1.5 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య

సి- 1.5 లక్షల నుంచి 2 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య

డి- 2 లక్షలు అంతకంటే ఎక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య

ఎస్‌బీఐ సమాధానం

ఎ- లక్ష కంటే తక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య - 5,74,137

బి- లక్ష, 1.5 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య - 2,62,341

సి- 1.5 లక్షల, 2 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య-1,65,607

డి- 2 లక్షలు, అంతకంటే ఎక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య - 89,373

2వ ప్రశ్న: ఈ ప్రభుత్వంలో వ్యవసాయ రుణమాఫీ పొందిన రైతుల మొత్తం సంఖ్యను అందించండి.

ఎ- లక్ష కంటే తక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య, మాఫీ అయిన మొత్తం

బి- లక్ష, 1.5 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య, మాఫీ అయిన మొత్తం

సి- 1.5 లక్షల, 2 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య, మాఫీ అయిన మొత్తం

డి- 2 లక్షలు, అంతకంటే ఎక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య, మాఫీ మొత్తం

ఎస్‌బీఐ సమాధానం

ఎ- లక్ష కంటే తక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య - 2,99,445. మాఫీ మొత్తం: రూ. 1,746,55,15,935

బి- లక్ష, 1.5 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య -1,30,915. మాఫీ మొత్తం: రూ.1,584,60,10,501

సి- 1.5 లక్షల, 2 లక్షల మధ్య రుణాలు పొందిన రైతుల సంఖ్య-65,321, మాఫీ అయిన మొత్తం రూ. 1,093,95,67,128.

డి- 2 లక్షలు, అంతకంటే ఎక్కువ రుణాలు పొందిన రైతుల సంఖ్య, మాఫీ మొత్తం - ఎలాంటి సమాచారం లేదు.

3 ప్రశ్న: రైతుల వ్యవసాయ రుణమాఫీ కోసం ప్రభుత్వం ఎంత మొత్తం కేటాయించింది?
జవాబు: ఎలాంటి సమాచారం లేదు.

4 ప్రశ్న: ఇప్పటివరకు కేటాయించిన మొత్తం నుంచి ఎంత మొత్తం మాఫీ చేయబడింది?
జవాబు: బ్యాంకు వద్ద సమాచారం లేదు.

5 ప్రశ్న: రుణ మాఫీకి ఇంకా ఎంత మొత్తం కావాలి?
జవాబు: తెలియదు, ఎందుకంటే జీవో నిబంధనల ప్రకారం మొత్తం అర్హుల జాబితా బ్యాంక్‌కు అందించలేదు

దేశాన్నే వంచించి..

> మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం ఎంతమంది రైతులకు ఎంతెంత రుణమాఫీ చేసింది? చేస్తున్న ప్రచారం ఏమిటి? వంటి విషయాలను లేఖలో ఉదహరించారు. రైతు రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కార్ అనుసరిస్తున్న వైఖరిని సమాచార హక్కు చట్టం ద్వారా వెల్లడైన విషయాలను లేఖలో పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డీ.. ఇవిగో సాక్ష్యాలు..

- కాంగ్రెస్ పార్టీ 2023, డిసెంబర్ 9న పంట రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. రాహుల్‌గాంధీ కూడా తెలంగాణ రైతులకు 2023, డిసెంబర్ 9న పంట రుణమాఫీ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయింది. పార్లమెంట్ ఎన్నికల సమయంలో దాని గడువును పొడిగించింది. తెలంగాణ రైతుల నమ్మకం పొందడానికి ముఖ్యమంత్రి దైవసాక్షిగా 2024, ఆగస్టు 15 నాటికి పంట రుణమాఫీ పూర్తి చేస్తానని మరోసారి హామీ ఇచ్చారు.
- రూ.2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేశామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటన పూర్తి అవాస్తవం. 2024, సెప్టెంబర్ 25న నేను దాఖలు చేసిన ఆర్టీఐ ప్రకారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అందించిన సమాచారం ఆధారంగా ఇది స్పష్టంగా తెలుస్తున్నది. లక్షలోపు రుణం ఉన్న రైతుల సంఖ్య 5,74,137 కాగా, 2,99,445 మంది రైతులకే రుణమాఫీ అయింది. లక్ష నుంచి 1.5 లక్షల మధ్య రుణ రైతుల సంఖ్య 2,62,341 కాగా, ఇప్పటివరకు 1,30,915 మందికే మాఫీ అయింది. రూ.1.5 లక్షల నుంచి 2లక్షల మధ్య రుణ రైతుల సంఖ్య 1,65,607 కాగా, ఇప్పటివరకు 65,231 మందికే మాఫీ అయింది. ఎస్‌బీఐ నుంచి అందిన డాటా ప్రకారం, సుమారు 5.5 లక్షల రైతులు అంటే సుమారు 50శాతం రైతుల రుణమాఫీ కాలేదు. ఇతర బ్యాంకులకూ దాదాపు ఇలాంటి పరిస్థితులే.
- రూ.2 లక్షలకు పైన ఉన్న రుణాలను రైతులు చెల్లించిన తర్వాత మాఫీ చేస్తామని ప్రకటించారు. చాలా మంది రైతులు పై మొత్తాన్ని చెల్లించారు. అయినా ఎస్‌బీఐ నివేదిక ప్రకారం రుణమాఫీ కాలేదు. దుర దృష్టవశాత్తు చాలా మంది రైతులు ముఖ్యమంత్రి మాటలను నమ్మి వారి పంట రుణం మాఫీకి అర్హులు కావడానికి ప్రైవేట్ రుణాలను అధిక వడ్డీకి తెచ్చుకున్నారు.
- మాఫీకి 31 షరతులు పెట్టి చాలా మంది రైతులను అర్హత కోల్పోయేలా చేశారు.
- కేసీఆర్ ఆరేండ్లుగా రూ.72,000 కోట్లను రైతుబంధు ద్వారా రైతులకు అందించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి దసరా ఇది. వానకాలం పంటకు పెట్టుబడి సాయం ఇప్పటికీ అందించలేదు. రుణ మాఫీ చేసినట్టు దేశమంతా తప్పుడు ప్రచారం చేసే ముందు, రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని పూర్తి చేయాలి.

2 లక్షల్లోపు మాఫీ అయిపోయింది

> మొదటిపేజీ తరువాయి...

హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చినా రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు' అంటూ ఈనెల 5న మహారాష్ట్రలో నిర్వహించిన ఓ బహిరంగ సభలో మోదీ చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ రేవంత్‌రెడ్డి రాసిన లేఖను ఆదివారం ఎక్స్ వేదికగా విడుదల చేశారు. 'మీరు చేసిన ప్రకటన వాస్తవికతను ప్రతిబింబించనందున నేను బాధపడ్డాను.. ఆశ్చర్యపోయాను' అంటూ లేఖలో వాపోయారు. రుణమాఫీ కోసం బడ్జెట్‌లో రూ. 26 వేల కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. అవసరమైతే రూ.31 వేల కోట్ల వరకు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రస్తావించారు. మొదటి విడుతలో రూ.2 లక్షల వరకు మాఫీ చేశామని, మరో విడుతలో రూ.2 లక్షలకు పైగా లోన్లను మాఫీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల్లో రుణమాఫీకి అగ్ర ప్రాధాన్యమిచ్చామని, రుణమాఫీ ద్వారా తమ అంకితభావాన్ని చాటుకున్నామని తెలిపారు. 'ప్రధానమంత్రి గారూ తెలంగాణ రైతుల ఆత్మస్థయిర్యాన్ని తగ్గించే బదులు..ఇద్దరం కలిసి పెంపొందించేందుకు ప్రయత్నిద్దాం' అని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు మోడల్‌గా నిలుస్తున్నదని, తెలంగాణ అభివృద్ధి, రైతు సంక్షేమానికి సహకారం కావాలని లేఖలో ప్రస్తావించారు.

మాఫీ గోల్‌మాల్.. సీఎం సెల్ఫ్‌గోల్

> మొదటిపేజీ తరువాయి...

కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఈ పార్టీలు ఎన్నికల కోసం తప్పుడు హామీలు ఇస్తున్నాయి' అని చేసిన వ్యాఖ్యలకు రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇవ్వబోయి అసలు నిజాలు వెల్లడించారు. రుణమాఫీ వివరాలతో ప్రధానికి రాసిన లేఖ ద్వారా ఇప్పుడు సెల్ఫ్‌గోల్‌లో పడ్డారు. 'మేము రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉండగా, బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు కేటాయించాం. ఇప్పటి వరకు కేవలం 27 రోజుల్లో మూడు విడతల్లో రూ.2 లక్షలలోపు రుణాలు కలిగిన 22,22,067 మంది రైతులకు రూ.17,869 కోట్ల రుణాలను మాఫీ చేశాం' అని లేఖలో ప్రస్తావించారు. పూర్తిగా రుణమాఫీ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఇంకా 19,77,933 మంది రైతులకు రూ. 13,131 కోట్ల రుణాలు మాఫీ చేయాల్సి ఉన్నట్టు సీఎం రేవంత్‌రెడ్డే పరోక్షంగా వెల్లడించారు. లేఖలో రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న రైతుల అంశాన్నీ రేవంత్ ప్రస్తావించారు. ఆ రైతులకు రుణమాఫీ చేయలేదని ఆయనే ఒప్పుకొన్నారు.

దేవుళ్లపై ఒట్టేసి.. అరకొరే రుణమాఫీ

'డిసెంబర్ 9న రుణమాఫీ అని ఒకసారి, దేవుళ్లందరిపైనా ఒట్టుపెట్టి మరీ ఆగస్టు 15 అని ఒకసారి రేవంత్‌రెడ్డి హామీనిచ్చి తర్వాత నాలుక మడతేశారు. ఆగస్టు 15లోగా 2లక్షల వరకు పంట రుణాలు పూర్తిగా మాఫీ చేస్తే రాజీనామా చేస్తానని మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. దిగివచ్చిన సర్కార్ ఆగస్టు 15వరకు అరకొర రుణమాఫీ చేసింది. తర్వాత హరీశ్‌ను రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు వెంటబడ్డారు. కానీ, రుణమాఫీ సగం కూడా పూర్తి కాలేదని బీఆర్ఎస్ నేతలు లెక్కలతో సహా తేల్చిచెప్పడం, రాష్ట్రమంతటా రుణమాఫీ కాని రైతులు ఆందోళనలకు దిగడంతో ప్రభుత్వ పెద్దలు గమ్ముగుండిపోయారు.

ఆరు గ్యారెంటీలపై నిలదీయండి

- కాంగ్రెస్ మోసంపై దసరా సందర్భంగా కుటుంబసభ్యులు, దోస్తులతో చర్చ పెట్టండి
- మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీలతోపాటు, రైతు, యూత్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ డిక్లరేషన్లపై కాంగ్రెస్ పార్టీని నిలదీయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గ్యారెంటీలు అమలు చేయకపోగా, అవ్వాతాతలకు పింఛన్ పెంచలేదని, రుణమాఫీ పూర్తి చేయలేదని, రైతు బంధు వేయలేదని, రైతు భరోసా దిక్కు లేకుండా పోయిందని, బోనస్‌ను బోగస్ చేశారని ఆదివారం ఎక్స్‌వేదికగా దుయ్యబట్టారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలని చెప్పి 10 నెలలైనా అతీగతి లేదని, 4 వేల నిరుద్యోగభృతికి నీళ్లొదిలిందని విమర్శించారు. నిరుడు దసరా సందర్భంగా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని గ్రామాల్లో ప్రచారం చేసిన యువత ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. దసరాకు ఊళ్లకు వస్తున్న కుటుంబ సభ్యులు, స్నేహితులతో అలయ్ -బలయ్ తీసుకుంటూ కాంగ్రెస్ చేసిన మోసాలపై చర్చించాలని కోరారు.

ఫీజు బకాయిలు 6,500 కోట్లు

- 10 నెలలైనా పైసా ఇవ్వని రేవంత్ సర్కారు
- విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వని కాలేజీలు
- అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్న స్టూడెంట్స్
- ఆకునూరి మురళి ఎటు వెళ్లారు?
- తెలంగాణ బిడ్డలకు విదేశీ విద్య దూరం
- బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 10 నెలల పాలనలో ప్రైవేట్ కాలేజీలకు నయాపైసా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. తెలంగాణభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రీన్‌చానల్ ద్వారా మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. విద్యాశాఖపై ఒక్క సమీక్ష కూడా పెట్టలేదని దుయ్యబట్టారు. రూ.6,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా రాష్ట్రంలోని 12.50 లక్షల మంది విద్యార్థులను రేవంత్ సర్కారు ఇబ్బందులకు గురిచేస్తున్నదని ధ్వజమెత్తారు. కేసీఆర్ తీసుకొచ్చిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని కాంగ్రెస్ సర్కారు అమలుచేయకపోవడంతో విదేశీ విద్యకు విద్యార్థులు దూరమవుతున్నారని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించని కారణంగా కళాశాలల యాజమాన్యాలు బోధనేతర సిబ్బందికి వేతనాలు చెల్లించడం లేదని, విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని తెలిపారు. దీంతో అప్పులు చేసి ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్తున్నారని చెప్పారు. ఈ నెల 14 వరకు గడువు ఉన్న స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు దరఖాస్తు చేసేందుకు సిద్ధమైన నర్సింగ్ కాలేజీల విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తలేరని తెలిపారు. విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకొస్తానని చెప్పిన ఆకునూరి మురళి ఇప్పటం లేకే రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం లేదా అని ప్రశ్నించారు. మహిళా కమిషన్ చైర్ పర్సన్ ప్రైవేటు కళాశాలలను పరిశీలిస్తున్నట్టుగానే, ప్రభుత్వ గురుకులాలను కూడా పరిశీలిస్తే నాసిరకమైన భోజనం, విద్యార్థుల కష్టాలు తెలుస్తాయని చెప్పారు. గతంలో బాసర ట్రిపుల్ ఐటీ గోడలు దూకి వెళ్లిన రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ఒక్కసారి కూడా అక్కడికి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు సీఎం క్షమాపణ చెప్పాలి

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులు గంజాయి తాగుతున్నారంటూ అభాండాలు వేసిన సీఎం రేవంత్ వారికి క్షమాపణలు చెప్పాలని గెల్లు శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆయన వద్ద ఏమైనా ఆధారాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారనే విద్యార్థులను ఈ విధంగా బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, నాయకులు నవీన్‌గౌడ్, విశాల్, కాల్వ నితీశ్ పాల్గొన్నారు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చౌరస్తాలో దీక్షను భగ్నం చేసి టెంట్‌ను తొలగించడంతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి కొప్పుల, జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, నడిపెల్లి దివాకర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

బీఆర్ఎస్ దీక్షపై పోలీస్ జులుం

> మొదటిపేజీ తరువాయి...

వైఖరిని తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, నడిపెల్లి దివాకర్‌రావు, మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పోలీసుల వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజాస్వామ్యయుతంగా శాంతియుత వాతావరణంలో దీక్ష నిర్వహిస్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరికాదని, అతిగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు దీక్ష జరగకుండా పోలీసులు విశ్వప్రయత్నాలు చేయగా, టీబీజీకేఎస్, బీఆర్ఎస్ శ్రేణులు రూటు మార్చారు. టీబీజీకేఎస్ కార్యాలయ ఆవరణలో టెంటు వేసి దీక్ష చేపట్టారు.

నికర లాభాలపై వాటా ఇవ్వాల్సిందే

సింగరేణి లాభాల్లో వాటా లెక్కల్లో యాజమాన్యం గోల్‌మాల్ చేస్తున్నదని, కార్మికుల శ్రమను దోచుకుంటున్నదని దీటు సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో రూ.4,701 కోట్ల నికర లాభాలు సాధించిందని అన్నారు. 33 శాతం వాటా అంటే కార్మికులకు రూ.1,550 కోట్లు వస్తాయని తెలిపారు. అయితే సంస్థ విస్తరణ కోసం రూ.2 వేల కోట్లు మినహాయించుకున్న తర్వాత మిగిలిన డబ్బులపై 33 శాతం అంటే రూ.796 కోట్లను మాత్రమే వాటాగా పంచుతామని పేర్కొనడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే నికర లాభాలపై వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సురేఖ వ్యాఖ్యలు నరహత్య కంటే ఘోరం

- 14న ఆమె వ్యాఖ్యలపై హైకోర్టులో పిల్ వేస్తా
- సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించాలి
- ప్రజాశాంతి అధ్యక్షుడు కేఏ పాల్

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): అక్కినేని కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు నరహత్య కంటే ఘోరమైనవిగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అభివర్ణించారు. తన మాటలను వెనక్కి తీసుకున్నానంటే సరిపోదని, నాగార్జున ఇంటికి వెళ్లి క్షమాపణ కోరాలని, అంతే కాకుండా మంత్రి పదవికి కూడా ఆమె రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తాను పెట్టిన గడువు ముగిసినా సురేఖ రాజీనామా చేయనందున 14న హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) వేస్తానని తెలిపారు. సురేఖపై డీజీపీ కేసు నమోదుచేయాలని, హైకోర్టు సుమోటోగా కేసు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో పరిస్థితి యథా రాజా తథా మంత్రి అన్నట్టుగా ఉన్నదని, ముఖ్యమంత్రి మొదలు మంత్రులు అందరూ బూతు పురాణమే అందుకుంటున్నారని ఆక్షేపించారు. హైదరాబాద్ అమీర్‌పేటలోని తన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నరహత్య అంటే ఒకరి ప్రాణమే పోతుందని, కానీ, సురేఖ వ్యాఖ్యలు ఒక్క సినీరంగానికి సంబంధించినవి కావని, కోట్ల మంది భారత ప్రజల మనోభావాలకు సంబంధించినవని అన్నారు. మంత్రి వ్యాఖ్యలను మర్చిపోవాలని టీపీసీసీ చీఫ్ అంటున్నారని, అడ్డగోలుగా దూషించి మర్చిపోవాలంటే ఎలా? అని ప్రశ్నించారు. గతంలో అసెంబ్లీలో దానం నాగేందర్ బూతులు మాట్లాడారని, ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కోర్టులో కేసు వేశానని గుర్తుచేశారు. 1975లో ఇందిరాగాంధీని, ఇటీవల రాహుల్‌గాంధీని కూడా డిస్‌క్వాలిఫై చేశారని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానులేనని, ఎవరూ అతీతులుకారని పేర్కొన్నారు. ఈ దేశంలో బాగుపడాలంటే పొలిటికల్ కరెక్షన్ ఉండకూడదని సూచించారు.

అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సర్కార్‌కు 60 రోజులే డెడ్‌లైన్!

- కులగణనపై జీవోల పేరిట కాలయాపన
- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల
- బీసీల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరిక

రవీంద్రభారతి, అక్టోబర్ 6: 'కులగణనపై జీవోల పేరిట కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ నెల 7 నుంచి 60 రోజుల పరకు డెడ్‌లైన్ విధిస్తున్నాం' అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టంచేశారు. బీసీల జీవితాలతో సీఎం రేవంత్‌రెడ్డి బీసీల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో జాజుల మాట్లాడారు. కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు పోతే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల ఆగ్రహానికి గురవుతుందని చెప్పారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా కులగణనపై సీఎం, మంత్రులు మాట్లాడటం లేదని విమర్శించారు. ఇదే వైఖరి అవలంబిస్తే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పాలన చివరిది కాబోతుందని తెలిపారు. కాంగ్రెస్ నిర్లక్ష్యంపై 50 వేల మందితో మహారాష్ట్ర ఎన్నికల్లో సర్కారు మోసాలపై ప్రచారం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గ